# అన్నదాత

శ్రీ రావెళ్ల హనుమంతరావు

తెల్లవారుఝామున కోళ్ళు కూశాయ్. గూళ్ళల్లో కమ్మివేయ బడిన కోళ్ళు ఘనంగా కూశాయి. బయట ఇళ్ళమీద, చెట్లమీదవున్న కోళ్లు నెమ్మదిగా కూశాయి. మంచుకు గొంతుక బొంగురు పోయి వుండవచ్చును; లేక తాము బయటనున్నట్లు తెలిస్తే పిల్లులు వచ్చి చంపేస్తాయని భయపడవచ్చును. మొత్తంమీద కోడిపుంజులన్నీ కూశాయ్. ఒకదాని తరువాత మరొకటి వేలంవెర్రిగా కోళ్లన్నీ కూసినప్పటికి తెల్లవారడానికింకానూ చాలా ఆలస్యముంది.

అయినా రామిరెడ్డి కోడికూత వినంగానే దిగ్గునలేసి కూర్చున్నాడు చలి విదిలించి కొడుతూంటే! అతను మంచం మధ్యనే కూర్చొని క్రిందకువంగి పొగాకు పట్టా అందుకొని నెమ్మదిగా చుట్ట జుట్టుకొని దీపందగ్గరకెళ్లి చుట్టకాల్చుకున్నాడు. మళ్ళీ తిరిగి మంచందగ్గర కొచ్చి పదితునకల పొగాకు జేబులో పెట్టుకొని పట్టా జుట్టి భద్రంజేసుకున్నాడు. పైపంచి తలకు చుట్టుకొని, మంచంమీద నున్న గొంగళీ దీసి కప్పుకొని, చెప్పులు తొడుక్కొని, కర్ర చేతబట్టి కూతుర్ని పిలవటం ప్రారంభించాడు.

అమ్మాయి

...............

అమ్మాయి

...............

ఆ వేళప్పుడు ఆవిధంగా ఎన్ని కేకలు వేసినా తన కూతురు లేవదని రామిరెడ్డికి తెలుసును. ఎంతసేపటికైనా కేకలు విని లేచేది భార్యయేననే సంగతి అతనికి నిత్యానుభవమే. అయినప్పటికీ భార్యను పేరెత్తి పిలువడు. అలాచేస్తే సంఘం పరిహసించుతుందని-హిందూ ధర్మశాస్త్రం శిక్షించుతుందని రామిరెడ్డికి భయం. కనుకనే అతను కూతుర్ని పిలుస్తున్నాడు. ఒకటి-రెండు కేకలకు సమాధానం రాకపోయేసరికి గొంతు పెద్దదిజేసి మరింత గంభీరంగా పిలిచాడు.

అమ్మాయి.

ఎంత మొద్దునిద్దరే ?

మూడోసారి కేకవేసేసరికి భార్యకు మెలకువవచ్చింది. ఆమె ముసుగుదీసి బయటకు చూడకుండగానే విసుగుతో గొణగడం ప్రారంభించింది. "అర్ధరాత్రి వేళ-మద్దెల దరువని ఏమిటీ కేకలు ?"

"పొలం వెళ్ళుతూన్నా గాని తలుపేసుకో."

"లేడికి లేచిందే ప్రయాణమన్నారు. అట్లాగే వుంది మీ పని. కాకపోతే ఇప్పుడప్పుడే పొలమేమిట"ని భార్య అనేసరికి-

"నీ దుంపతెగ. కోళ్ళు కూసినాయ్. ఇంకా ప్రొద్దేముంది? లే...లేచి తలుపేసుకో. పెందలాడే అన్నంవండి తూర్పు పొలానికి పంపించు. లే.. తలుపేసుకో."

తలుపు గడ తీసిన శబ్దం వినగానే ఇక లాభం లేదనుకొని రాజమ్మ ముసుగు తొలగించుకొని తలుపు దగ్గరకొచ్చి భర్తను పిలచి పాడిగేదకు పచ్చమేతవేసి వెళ్ళండని చెప్పి తలుపేసుకొచ్చింది. మంచందగ్గర కొస్తూ తనలో తానే గొణుక్కుంది.

"కోళ్లు కూశాయట పాడు కోళ్ళు. ఈ సంక్రాంతి పండుగరోజులు వస్తే చాలు. మరీ అర్ధరాత్రివేళనే కూయటం ప్రారంభించుతాయి. రేపు పండుగ మూడురోజులు వేసే పందేలతో గాని వీటిరోగం కుదరదు"

రాజమ్మ గొణుక్కుంటూనే మంచంమీద నెమ్మదిగా నడుంవాల్చి దుప్పటి కప్పుకొంది.

## 2

రామిరెడ్డి బయట కొచ్చేసరికి మంచుతెర గాఢంగా క్రమ్ముకొనివుంది సామాన్యపు మంచుగాక వర్షం కురిసినట్లే కురుస్తోంది. చలి మరింత జోరుగా వేస్తోంది. గాఢంగా క్రమ్ముకొనివున్న మంచులో పదిగజాల దూరమందేమున్నదో కనుపించడం లేదు రామిరెడ్డి అలాగే నెమ్మదిగా చావిడిదగ్గర కెళ్లాడు. అతను చేయగల్గిందిలేక కుందేడు గడ్డి ఇవతలకు దెచ్చుకొని చలిమంటవేసుకొన్నాడు. కాసేపు అలాజరిపేసేసరికి మంచుతెర తగ్గిపోయింది. వెంటనే నిప్పును శుభ్రంగా ఆర్పివేసి, పాడిగేదకు పచ్చమేత వేసి, ఎద్దుల్ని వూడదీసుకొని పొలం తోలుకెళ్ళాడు.

గ్రామం వదలిపొలిమేరకువచ్చి తూర్పువైపుకు జూసేసరికి మంచుతెరల్ని – చీకటిచాటుల్ని చీల్చుకొంటూ పైకి వస్తూన్న దివ్యజ్యోతి రామిరెడ్డికి కనుపించింది. అదే వేగుచుక్క. తూర్పువైపునుండి కనుపించే ఆ ఎర్రచుక్కయే కష్టజీవులకు మార్గదర్శి. ఎర్రగా బంతిపూవులా మిలమిలా మెరిసే ఆ వేగుజుక్కయే రైతులకు కర్తవ్యాన్ని బోధించుతూ వారిని కర్మవీరులుగా జేస్తుంది. కుప్పలునూర్చే కార్యక్రమం ప్రారంభించినప్పటినుండి వేసవికాలం పనులన్నీ సంపూర్తి అయ్యేవరకు రైతులకు రాత్రివేళ టైమును తెలిపే గడియారం ఆ వేగుచుక్కయే. ఆ చుక్క పొడిచి పైకివచ్చి కంటికి కనుపించిన తరువాత తిరిగి నిద్రపోవడానికి ఏ రైతు మనస్సూ అంగీకరించదు.

వేగుచుక్క కొంచెం పైగా కనుపించడంతోనే రామిరెడ్డి మరింత జోరుగా ఎద్దుల్ని అదలించటం ప్రారంభించాడు. పాడు మంచుపట్టటంవలన ఆలస్యమయిందని మంచును తిట్టుకున్నాడు. ఛకఛకా ఎద్దుల్ని నడిపించి పొలం జేరుకున్నాడు. నెమ్మదిగా మిగతా రైతులు-కూలీలుగూడా వచ్చారు అంతా కలసి కుప్పనూర్చే కార్యక్రమానికి పూనుకున్నారు...

## 3

ఈ రోజుల్లో, రైతులు- నౌఖర్లు – కూలీలంతా కుప్పలునూర్చే కార్యక్రమంలో నిమగ్నమైయున్నా, ఉదయం ఏడు, ఎనిమిదిగంటలయ్యేసరికల్లా కుప్పల్లో వున్నవాళ్ళకు విపరీతమైన ఆకలి వేస్తుంది. చరచరా ప్రొద్దు పైకెక్కినకొద్దీ కడుపులో ఆకలి కరకరలాడుతూంటుంది. గ్రామంలో ఇళ్ళదగ్గర ఉన్నవాళ్ళ కింకా చలే వదలదు. మరీ సోమరిపోతుల రకానికి జెందినవారిరే వేళకు నిద్రలేవరు గూడాను గడ్డిలో పనిచేసే వాళ్ళు మాత్రం ఆకలి ..ఆకలంటూ ఆరాటపడుతూంటారు.

కుప్పదగ్గరకు ఒక్కొక్కరి అణ్ణాలే వస్తున్నాయి. అన్నం రానివాళ్లు ఆదుర్దాతో వూరివైపుకు ఎదురు జూస్తున్నారు.

అందరి భోజనాలు వచ్చినతరువాత ఆఖరుకు రామిరెడ్డి భోజనం వచ్చింది. చిన్న కూతురంటే రామిరెడ్డికి చాలా ఇష్టము. తెలిసిగాని, తెలియకగాని, పొరపాటునగాని, గ్రహపాటునగాని ఆమె ఎప్పుడైనా, ఏదైనా తప్పుజేసినప్పటికి కొట్టడు సరిగదా కోపంతో కసరుకోనడుగూడాను. ఇంట్లో మరెవ్వరైనా అయితే ఇంటి కప్పు ఎగిరిపోయేట్లు కేక లేస్తాడు. తల్లి - దండ్రులకు మిగతావారందరికంటే తమ సంతానంలోని చిన్న పిల్లమీద అధిక ప్రేమ వుండటంలోక సహజమేమో? చిన్న కూతురిమీద ప్రేమ అధికంగా వుండటంవల్లనే ఆమె అందరికంటే ఆలస్యంగా అన్నం తెచ్చినప్పటికి రామిరెడ్డి కోపం లేకుండా ఇలా అన్నాడు.

“ఇంత ఆలస్యంజేస్తే ఎలాగమ్మా! అటు చూడు వాళ్ళందరికీ అన్నాలు వచ్చాయి. నాకింకా అన్నం రాలేదని ఎదురుచూస్తున్నాను. నా కడుపుల్లో ఎంత ఆకలివున్నదో వూహించు. గడ్డిలో పనిజేసేప్పుడు కాస్త ప్రొద్దెక్కితే సరి ఆకలి దహించుకపోతుంది. కొంచెం వేళ తప్పితే సరి దాహం మొక్కువవుతుంది. ఈ రోజుల్లో తగినంత తిండితినాలి గాని, నీరు్రతాగితే మనషి పనేమి చేయగల్గుతాడు?”

తండ్రిమాటలు విన్న కూతురు పెదిమెల మీదకు చిరునవ్వును దెచ్చుకొని, “వచ్చేది పండుగగాదేమిటి? అందులో పెద్ద పండుగయ్యె. మరి ఇంటిదగ్గర పండుగపనులు పూర్తిగావద్దేమిటి?” అంది.

“పిచ్చితల్లీ! మీ పండుగ పనుల హడావుడి తుప్పల్లోవున్న మా అందర్ని ఆకలితో చంపేస్తారేమిటి? వేళకు తిండిలేకుండగా పండుగ పనులేమిటమ్మా?”

ఈ మాటలు వినేసరికి కూతురుకు కొంచెం కోపం వచ్చింది. మాట అదో రకంగా విరుచుకుంది—

“మీకెప్పుడూ పొలాన కూర్చోని కబుర్లు అలాగే చెబుతారు. చీకటి వుండగానే లేచి వాకిళ్లన్నీ శుభ్రంగా వూడ్వాలి. కళ్లాపిజల్లాలి. చక్కచక్కని సంక్రాంతి ముగ్గులేయాలి. ఆవుపేడ దెచ్చి గొబ్బిళ్లు చేయాలి. వాటికి పసుపు-కుంకుమ- బంతిపూవులు పెట్టాలి. తల్లిగొబ్బెమ్మదగ్గర సాంబ్రాణిపొగ వేసి నైవేద్యం పెట్టాలి. అప్పుడా గొబ్బెమ్మలను తీసుకెళ్లి పాకిళ్లలో పెట్టాలి. ఇది చిన్నక్కాయి-నేనూ చేసేపని. ఇంక అమ్మ-పెద్దక్కాయి ఇంట్లో పనులు జేసుకొని, గేదెలకు కుడితి బెట్టి-పాలుపితుక్కొని పనులైన తరువాత నాకు అన్నం పెడితే తిస్తాను. మీకు తెచ్చాను నేను మాత్రం కూర్చున్న దెక్కడేమిటి?”

ఈ మాటలు విన్న వెంకిరెడ్డి నవ్వుతూ ఇలా అన్నాడు. “బావా ఇలాగైతే మీ అమ్మాయి మొగుడుకు బాగానే అన్నం పెడుతుంది. చేసుకున్నవాడు ఒక్కరోజుతో మలమలమాడి చావవలసిందే”

వెంకిరెడ్డి అన్నమాటల్ని పెద్ద పాటింపులోకి తీసుకోకుండగానే రామిరెడ్డి కూతురు వైపుజూసి- “పోనీలే..... రేపటి నుండి యైనా కొస్త పెందలకొడనే అన్నాలు తెచ్చిపెట్టు అన్నాడు.

సరే లెమ్మన్నట్లుగా తలవూపిన కూతురు గేదెకు పచ్చగడ్డి ఏ గట్టున కోసుకెళ్ళనని అడిగింది.

“పచ్చగడ్డి నువ్వు కోసుకెళ్ళడమేమిటి? అమ్మ ఏమైంది?” అని తండ్రి అడిగేసరికి—

“పండుగ దగ్గరకు రావడం లేదేమిటి?



## అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవటం అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు, ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

**వీనస్ రీసెర్చి లేబరేటరీ,**

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)



## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ గోదావరి.



## ఆంధ్రవాఙ్మయ చరిత్ర

**వెల రు 2-0-0 లు,**

తపాలాఖర్చు ప్రత్యేకము

ఆంధ్రగ్రంథమాల,

పోస్టు బాక్సు 212, మద్రాసు-1.


అందుచేత ఇల్లు మరమ్మతు చేస్తోంది. కత్తికలు వలవాలి. మన్నూ-పేడ-వూక కలిపి మెత్తగా తొక్కాలి. ఒక్కొక్క యింటికే గుద్ద కట్టువేయాలి. తరువాత ఇళ్లన్నీ అలకాలి. గోడలకు సున్నం రాయాలి అరుగులు బాగుజేసుకోవాలి. పప్పులు వండుకొనేందుకు పిండి గొట్టుకోవాలి. పనులున్నాయని అమ్మ పచ్చగడ్డికి రానన్నది. ఈ వారంరోజులూ నన్నే కోసుక రమ్మనమంది." కూతురు చెబుతూన్న మాటలు వింటూన్న తండ్రి యీ లోకాన్నే మరచిపోతూన్నాడు. అందరూ గబగబా అన్నం తింటూంటే రామిరెడ్డి నెమ్మదిగా తింటున్నాడు. కూతురు పచ్చగడ్డిని కోసుకెళ్ళతాననే అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసినప్పుడు రామిరెడ్డి ఒక్కక్షణం పాటు మహానందాన్ని అనుభవించాడు. తన కొడుకులు—కూతుళ్ళందరూ తనలాగానే కష్టపడి పనిజేయడానికి ఉత్సాహాన్ని కనపరచడం మాటిమాటికి గుర్తుకు తెచ్చుకొని మురుసుకొన్నాడు.

"అలాగైతే మంచిఎత్తుగడ్డి ఆ బోదెగట్టునున్నది కోసుకెళ్ళు. ప్రతిరోజూ ఆనవాలుగా కోసుకెళ్ళుతూండు. గడ్డిలో జాగ్రత్త. పురుగులుంటాయి."

ఎడమచేత్తో తట్ట బట్టుకొని, కుడిచేతిలో కత్తి అటూ ఇటూ త్రిప్పుతూ ఒయ్యారంగా బోదెగట్టువైపుకు నడుస్తూన్న కూతురు గభాలున ఆగి తండ్రివైపుకు జూసి "పండుగకు బావయ్యను తీసుకురావాలట"ని తనలో తానే నవ్వుకొంటూ బోదెగట్టుకు వెళ్లిపోయింది.

## 4

అందరూ కలసి భోజనాలు తింటున్నారు. రైతు-కూలీ వర్గభేదం లేదు. అవర్ణులు-సవర్ణులు వర్ణభేదం లేదు. పెద్దా-చిన్నా వయస్సుభేదం లేదు. అందరూ కలసి ఏకపంక్తిగా కూర్చొని భోజనాలపని పూర్తిజేస్తూన్నారు. ఎద్దులు బంతికట్టులో నిలబడి నెమర్లు వేస్తున్నాయి. గిత్తలకు కాళ్లనొప్పులు పుట్టాయి కాబోలు అక్కడనే, బంతికట్టులోనే పడుకొని నెమర్లు వేస్తూన్నాయి. పెద్ద యెద్దులకు ఆకలి దీరక ఇంకనూ మొరుగుకంకులు నములుతూనే ఉన్నాయి.

ఇంతలోకే తొమ్మిదిగంటల రైలుబండి వచ్చే కూత వినిపించింది. అందరూ భోజనాలపని గబగబా పూర్తిజేసుకొని లేచి చేతులు కడుక్కొన్నారు. చుట్టలు జుట్టేవాళ్లు చుట్టల్ని - బీడీలు కాల్చేవాళ్ళు బీడీల్ని - ఎవరి అవుసరాల్ని వారు తీర్చుకొని తిరిగి పని ప్రారంభించారు.

నిముషంసేపు అయినా విశ్రాంతి తీసుకోరు తెల్లవారుఝామున నాల్గు గంటలకే లేస్తారు. రాత్రి ఎనిమిది గంటలవరకు పనిజేస్తూనే వుంటారు. రోజుకు పదహారు గంటలు పనిజేసినప్పటికీ మిగిలే ఫలితం మాత్రం హుళక్కి. వాళ్లు రైతులు. కష్టజీవులు. పచ్చని పైరులతో నిండి నిబిడీకృతమై కన్నుల కానందాన్ని గల్గించే పొలాల్లో వున్నంతకాలం విచ్చిన మనస్సులతో విహరిస్తారు. పైరులమీద తేలియాడుతూండే పిల్లవాయువులు వచ్చి తమపై పడుతున్నపుడు స్వర్గసుఖాన్ని అనుభవించుతారు. ప్రకృతిమాత ఒడిలో బంగారుపాప పంటపొలం అయితే, ఆమె అల్లారు ముద్దుపాపడు రైతు. అతడు దేశానికి వెన్నెముక. రాజ్యానికి రక్షకుడు. కోట్లాది జీవరాసులకు జీవనప్రదాత. జాతికి వెలుగు. సంఘానికి వెన్నెల అతను పొలంలో వుండి పనిజేయునప్పుడు అనుభవించే ఆనందం వేరు. అది మాతృదేవి ఒడిలో జేరి కేరింతలాడే పసిబాలుర ఆటలుకంటే ఆనందదాయకమైన పిడికొట్టుడు బల్లక్రింద జేరుతున్న ధాన్యపురాసుల్ని జూసి, అర్థచంద్రాకారంగా పెరుగుతున్న వరిగడ్డి గడిమిని జూసి, వరిమోళ్లు దాటి అప్పుడప్పుడే పైకి వస్తున్న మినుము—జనుము—పెసర మొక్కలను జూసి అతను పొందే ఆనందానుభూతి వేరు. అన్ని సంపదలను చేతికిచ్చే పొలంలో నిలబడి యున్నపుడు అతను కనే తీయని కలలే వేరు. అయితే, యీ తీయని కలలు పగటికలలవుతాయి గూడా.

గింజలు రాలగొట్టడం, గడ్డి దులపడం, బంతులు తోలడం అవసరాన్నిబట్టి అందరూ పనిజేస్తూన్నారు. రామిరెడ్డి గూడా తన వంతుపని పూర్తిజేసుకొంటూనే వున్నాడు. కూతురు తట్టనిండా పచ్చగడ్డిని కోసుకొని ఇంటికెళ్లుతూ మంచినీళ్ళ కొచ్చి తట్టను క్రిందదింపుకొని మంచినీళ్ళు త్రాగుతూ మళ్ళీ అంది "నాన్నా బావయ్యను పండుగకు తీసుకరావాలి."

మాటలో మాటగా నవ్వుతూ వెంకిరెడ్డి అన్నాడు. "బావా యీ పిల్ల పెళ్ళిఅయినతరువాత మొగుణ్ణి తీసుకొచ్చేవరకు పోట్లాడుతూనే వుంటుంది"

ఆ పిల్ల వెళ్ళినతరువాత కాసేపటికి ఏదో మాటల సందర్భంమీద తాతిరెడ్డి ఇలా అన్నాడు. "రామిరెడ్డీ! యీ సంవత్సరం రెండో అమ్మాయికి పెళ్ళిజేయ లేమిటి?"

"ఇప్పుడప్పుడే, తొందరేమి వచ్చిందిలే. పెద్దమనిషై ఇంకా మూడు మాసాలే కా లేదు"–రామిరెడ్డి పైవిధంగా సమాధానం చెప్పగానే తిరిగి ఎవరిపనిలో వారు నిమగ్నులైపోయారు.

అందరితోబాటు రామిరెడ్డిగూడా పని జేస్తూన్నప్పటికీ తనలో తాను తీవ్రంగానే ఆలోచించుకొంటున్నాడు.

"పండుగకు అల్లుణ్ణి తీసుకరావాలి. ఇది ఎలాగూ తప్పదు. అల్లునికి పంచెలు, అమ్మాయికి చీరెలు, ఇంట్లోవాళ్లకి బట్టలు, ఇంకా పండుగ ఖర్చులు. ఇంతే గాదు. పెద్దమ్మాయి పెళ్ళయి రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ఇస్తానన్న కట్నం ఇవ్వనేలేదు. పెళ్లి అయేనాటికి రెండుమూడు వేలు నిలువవుంటే అవి ఖర్చులకు సరిపోయాయి. కట్నంగా ఇస్తామన్న మూడు వేల రూపాయలు అప్పుడే ఇవ్వమని అడిగితే పంటలనాటికి వడ్డీతో సహా ఇచ్చేస్తానని చెప్పాను. గాలిపాటు సరిగ్గా లేక నిరుడు సంవత్సరం పంటలు సరిగ్గా పండకపోవటంవలన యీ సంవత్సరం ఇస్తానని చెప్పాను. పరిస్థితుల్ని బట్టిజూస్తే యీ సంవత్సరం గూడా ఇవ్వగలేట్లు కనుపించడంలేదు. పంట తరుగ్గానే కనుపించుతోంది. వ్యవసాయ శాఖవారు సకాలంలో ఎరువుల్ని సప్లయిజేస్తే బాగుండేది. వారా పని చేయకనేపోయారు. అధికోత్పత్తికి పూనుకొనండని రైతుల్ని హెచ్చరించుతూ కాగితాలమీద ప్లానుల్ని తయారుజేసి పేపర్లనిండా ప్రకటనలుజేసే ప్రభుత్వం అందుకు తగిన సహాయం రైతులకు చేయనే చేయటంలేదు. పంటలు తరగడం, జీవితావసరవస్తువుల ధరలు - వ్యవసాయపనిముట్ల ధరలు గత రెండు సంవత్సరాల్లోనూ కొరియా యుద్ధం పేరుతో విపరీతంగా పెరిగిపోవడం, ఇంట్లో ఖర్చులుగూడా జాస్తిగావడం, ఈ కారణాలన్నింటివల్ల చేసిన బాకీలు చాలా అయ్యాయి. ఈ సంవత్సరం పంట చిల్లర బాకీలకు - ఖర్చులకు సరిపోతుంది.

"మరోసంవత్సరం వచ్చేసరికి అల్లుని కట్నం వడ్డీతోసహా నాల్గువేలవుతుంది. రెండోఅమ్మాయి పెళ్ళిప్రయత్నం జరిగితే ఎంతలేదన్నా మళ్ళీ రెండువేలరూపాయలు ఖర్చు. ఇక కట్నం సంగతి సరే. మనకు మనంగా ప్రయత్నం చేయక పోయినా కలసివస్తే మాత్రం పెళ్ళిచేయక తప్పదు. ఖర్చులు-కట్నాలు తప్పవు.

"ఇద్దరు అమ్మాయిలకు కట్నాలక్రిందనూ, పెళ్ళి - పేరంటాల ఖర్చులక్రిందనూ మొత్తం మూడెకరాలు అమ్మవలసి వచ్చేట్లుంది. వున్న పదెకరాల్లో మూడెకరాలు పోతే ఏడెకరాలు మిగులుతుంది. ఇంకొక ఆడపిల్ల పెళ్లికుంటుంది. ఆ అమ్మాయి పెళ్లి నాటికి మరికొంత పొలాన్ని అమ్మితే చివరకు మగపిల్లలు ముగ్గురకు ఏమి మిగులుతుందో ఏమో!"

పనేమిజేస్తున్నప్పటికీ రామిరెడ్డికిదే ఆలోచన. నాల్గుగంటల రైలుబండి తిరిగి వచ్చేస్తోంది. అంతా తొందరపడుతున్నారు. చల్లబడిపోతే గాలివేయదు. గాలి తగ్గితే పోతపని పూర్తిగాదు. పోత పని పూర్తిగాకపోతే ధాన్యం ఇవ్వాళ ఇంటికి జేరవు. ధాన్యం ఇవాళనే ఇంటికి కెళ్లితే వీటిని పురిలో పోసేయవచ్చును. రేపు మరొక కుప్ప పడేయవచ్చును.

ఈ తొందర పనుల్లో మిగతావాళ్లతో బాటు తానుగూడా పనిజేస్తున్నప్పటికీ రామిరెడ్డి మనస్సుమాత్రం ఆవేశంతో-ఆవేదనతో-ఏదో ఆలోచించుతూనే వుంది. రైలు జీవితానికి, రైతుజీవితానికి మధ్యనున్న తేడాయేమిటి? జీవంలేని రైలు గొప్పదా? జీవమున్న రైతు గొప్పవాడా?



HVM 165-50 TL



కేశ సంపదకు

రీటా

హిందూ దేశమంతటా దొరకును

రత్నపురుషవేషం

సువర్ణము, క్వాల్షియములు కలిపి తయారుచేయబడినది శుక్లనష్టము, గుండెదడ. నరముల బలహీనము అతిమూత్రము మొ॥ మేహ వ్యాధులను హరించును బలమును. కాంతిని, ధాతుపుష్టిని, యిచ్చును అనేక యోగ్యతా పత్రములు కలవు డబ్బా రు 3-12-0. వి పి 0-14-0

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు - విజయవాడ-2

నపుంసకతైలం

అంగ నరములు బలహీనత చెందిచిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ.10/కల్దార్ వి.పి.రూ 1-0-0.
ఆర్డరుతో రు 1/- పంపవలెను.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్స్,
హైద్రాబాద్, దక్కన్.

రైలు ఉదయం తొమ్మిదిగంటల కెళ్లింది తిరిగి సాయంకాలం నాల్గుగంటలకు వచ్చేస్తోంది. రేపూ అంతే. ఎల్లుండి అంతే. ఎప్పుడూ అంతే. వెళ్లుతుంది. వస్తుంది. రైతూ ఇంతే. తెల్లవారుఝామున నాల్గుగంటలకు రావడం. రాత్రి ఎనిమిదిగంటలకు వెళ్ళడం. ఇది మామూలే. ఈవిషయంలో రైలు జీవితానికి-రైతు జీవితానికి మధ్య తేడా ఏమీ కనుపించడంలేదు.

ఇక మిగతా విషయాల్లో రైలే గొప్పదిగా కనుపించుతోంది. దాని మరలకు ఆయిల్-బొగ్గూ-నీరూ పూర్తిగా కావాలి. దాని కడుపుకు కావలసినంత ఆహారం. ఎప్పుడు పెట్టకపోతే అప్పుడు రపీమని ఆగిపోతుంది. రైల్వే శాఖకు చెందిన ప్రభుత్వ పరివారమంతా వచ్చినట్లుగా దానికి జోహుకుం చేయాలి. రైలుకున్న ఈ హక్కు రైతుకు లేదు. తనకు కావలసిన వ్యవసాయ పనిముట్లనుగాని, ఎరువుల్నిగాని, విత్తనాలనుగాని, పశువుల దాణాదినుసులనుగాని సకాలంలో-సరైన ధరలకివ్వమని ప్రభుత్వాన్ని గొంతెత్తి అడగలేడు. వీటికోసం సమ్మె చేయలేడు. ఎలాగో కష్టపడి-బాధపడి ఏదోవిధంగా పంట పండించిన తరువాత తాను అమ్మకొనే ధాన్యానికి గిట్టుబాటయ్యే ధర వచ్చేట్లుగా ప్రయత్నాలు చేసుకోవడానికి రైతుకు హక్కు లేదు. ధాన్యానికి ధర నిర్ణయించేప్పుడు ప్రభుత్వం రైతునిసలహా అడగదు. మిగతా పారిశ్రామిక వస్తువులధర విషయం అలాగాదు. రైతు అన్ని విధాలా అసమర్థుడు. పెట్టుబడిదారీ ప్రపంచంలో రైతుజీవితంకంటే రైలుజీవితమే గొప్పదిగానూ విలువ గల్గిందిగానూ వుంది. మరో ప్రపంచం విషయం ఎలా వుంటుందోగదా?

## 5

పొలాన పనులు పూర్తికాగానే ధాన్యం బస్తాలను బళ్ళకెత్తుకొని అందరూ ఇంటికొచ్చేశారు. ధాన్యాన్ని పురిలో పోసిన తరువాత వెంకిరెడ్డి, తాతిరెడ్డి మున్నగువారు కలసి పప్పులు నూర్చుకొనే సహాయదారులంతా తమతమ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

రామిరెడ్డిగూడా ఎద్దుల్ని చావిట్లోకి తోలుకెళ్లి కట్టేసి, మేతవేసి, ఇంటికి వచ్చాడు. భార్య తెచ్చియిచ్చిన వేరుశనగకాయలు తిని, కంచెంబుడు మంచినీళ్ళు త్రాగి, పొంతకాగు బయటపెట్టుకొని నీళ్లు పోసుకొంటున్నాడు. భార్య దగ్గిర కొచ్చి అడుగుతోంది.

"పండుగ దగ్గరకొస్తోంది."

"అయితే ఏమంటా వేమిటి?"

"ఎప్పుడూ ఇంతే. నేను మాట్లాడితే నేకస్సు బుస్సులాడుతారు. బయట అరుగుకైనా సిమెంటు రాస్తే బాగుంటుంది. రేపు పండుగకు అల్లుడు గూడా వస్తాడు. నాల్గు సిమెంటుకట్టలు—ఇసుక తెప్పించండి. మేమే ఎలాగో పని పూర్తి జేసుకొంటాము."

"అలాగే లే."

"బళ్లోకి పోయే మగపిల్లాళ్ళు గోలచేస్తున్నారు. పండుగనాటికన్నా కొత్త చొక్కాలు-లాగూలు కావాలంటున్నారు. రోజూ చన్న చంపుక తింటూన్నారు. రాత్రి వేళ మీరు వచ్చేసరికి వాళ్ళు నిద్ర పోతారు. తెల్లవారుఝామున వాళ్లు లేవక ముందే మీరు లేచివెళ్లిపోతారు. రేపు పండగకు తీసికొచ్చినప్పుడు అల్లునికి గూడా బట్టలు పెట్టాలి అందరికీ ఒకసారే తెండి."

"సరే. తీరుబడి అయినప్పుడు బస్తీ వెళ్ళి వస్తాను."

స్నానం పూర్తికాగానే అన్నం వడ్డించగా రామిరెడ్డి తింటూంటే రాజమ్మ అడుగుతుంది.

"పెళ్లీడు కొచ్చిన అమ్మాయికి గాజులైనా లేవు. నాల్గు సవరనులు బంగారం తెప్పించండి. రెండు జతలు గాజులు చేయించుదాం. ఎవ్వరైనా సంబంధాలవాళ్లు చూసేందుకు వచ్చినా బాగుంటుంది."

అల్లుని కివ్వవలసిన కట్నం బాకీ, వున్న చిల్లర రుణాలు, అమ్మాయి పెళ్లి కలిసివస్తే అయ్యే రుణం, వస్తూన్న ఆదాయం, అవుతూన్న ఖర్చులు అన్నింటినీ వివరంగా భార్యకు చెప్పేసి పరిస్థితుల్ని బట్టి జాగ్రత్తగా ఖర్చులు చేయమని రాజమ్మను మందలించుదామనుకున్నాడు. ఇంతలోనే బయటనుండి కేకలు వినుపించాయి.

సందా కవళం తల్లీ!

..............

ప్రొద్దుటినుండి తిండిలేదు మామ్మా!

..............

అన్నదాత గృహాలు అమ్మా!

రాజమ్మ ఒక ముద్ద అణ్ణం పట్టుకెళ్లి వాళ్లకు పెడుతోంది. రామిరెడ్డి అనుకొన్నాడు. అన్నదాతలం. నిజంగా మేము అన్నదాతలం. మా పరిస్థితు లెలా వున్నా ఇంతరులకు తప్పని సరిగా అన్నదానం జేస్తాం. మా ఇంట్లో పరిస్థితులు ఎలా వున్నప్పటికీ మేము బాహ్య ప్రపంచానికి అన్నదాతలమే. ముమ్మాటికి అన్నదాతలమే." ★

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి